సాక్షి కర్నూలు

బుధవారం ၊ 16 ၊ అక్టోబర్ ၊ 2024



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళా వేదికపై మంగళవారం నల్గొండ వారి హైందవిరెడ్డి బృందం సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



డిర్ర్... గోపరాక్!

గొరవయ్యల సందడితో దేవరగట్టు హోరెత్తింది. బన్ని ఉత్సవంలో రెండవ ప్రధాన ఘట్టమైన గొరవయ్యల నృత్యాలు, గొలుసు తెంపుట, దేవదాసీల క్రీడలు వైభవంగా జరిగాయి. -10లో



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,631.97
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 101.656
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 45,287
అవుట్ ఫ్లో	: 45,891

న్యూస్‌రీల్

హౌసింగ్ పీడీగా విశ్వనాథ్



కర్నూలు(అర్బన్): హంద్రీనీవా సుజల స్రవంతి యూనిట్ -3 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సీ విశ్వనాథ్‌కు జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తు జిల్లా కలెక్టర్ పీ రంజిత్ బాషా ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ పీడీగా విధులు నిర్వహించిన ఎం. సిద్ధలింగమూర్తి గుంటూరు జిల్లా డ్వామా అదనపు పీడీగా, పల్నాడు జిల్లా డ్వామా పీడీగా బదిలీ అయిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు విశ్వనాథ్ మంగళవారం జిల్లా గృహ నిర్మాణ సంస్థ కార్యాలయంలో పీడీగా అదనపు బాధ్యతలు స్వీకరించారు.

జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా నిమ్మల రామానాయుడు

కర్నూలు న్యూసిటీ: జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే జిల్లాకు చెందిన వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను అనంతపురం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా నియమించింది.

ఆర్‌యూ రిజిస్ట్రార్‌గా విజయ కుమార్ నాయుడు



కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం నూతన రిజిస్ట్రార్‌గా అసోసియేట్ ప్రొఫెసర్ బి. విజయకుమార్ నాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సముద్రాల వెంకటేశ్వర్లు వ్యక్తి గత కారణాలతో రాజీనామా చేయడంతో విజయకుమార్ నాయుడును నియమించారు. ఏడాది పాటు పదవిలో కొనసాగుతారు.

నిష్పక్షపాతంగా విచారణ చేయండి



గోవిందమ్మతో మాట్లాడుతున్న ఎస్పీ

మంత్రాలయం : పెద్దకడబూరు మండలం కల్లుకుంట గ్రామానికి చెందిన గోవిందమ్మపై దాడి కేసును నిష్పక్షపాతంగా విచారణ చేసి న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఎస్పీ బిందు మాధవ్ ఆదేశించారు. గోవిందమ్మ కుమారుడు ప్రేమ వివాహం చేసుకున్నాడన్న కారణంతో బీసీ వర్గీయులు ఆమెపై దాడి చేసిన విషయం విధితమే. దాడిని నిరసిస్తూ ఆమె ఎమ్మిగనూరు పట్టణంలో రిలే దీక్షలకు పూనుకుంది. విషయం తెలుసుకున్న ఎస్పీ మంగళవారం సాయంత్రం కల్లుకుంటకు చేరుకుని ఆమెను పరామర్శించారు. కేసు విషయంలో న్యాయం చేస్తామని ఆమెకు భరోసా ఇచ్చారు. కేసు విచారణలో నిష్పక్షిపాతంగా వ్యవహరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎస్పీ వెంట డీఎస్పీ ఉపేంద్రబాబు, సీఐలు మంజునాథ్, విక్రమ్‌సింహా ఉన్నారు.



లక్కు ఎవరిదైనా.. కిక్కు మాకే!

అదృష్టం మీదైనా.. వ్యాపా'రమ్' మాత్రం మాదే అంటోంది మద్యం సిండికేట్. లక్కీ 'డ్రా'ప్ మీకు దక్కినా.. కిక్కు మాకే అంటూ తెలుగు తమ్ముళ్లు అ'రా'చకాలకు పాల్పడుతున్నారు. సిండికేట్‌ను కాదని దుకాణం తెరిస్తే 'పెగ్గు' కూడా అమ్మలేరంటూ బెదిరింపులకు దిగుతున్నారు. 'గుడ్‌విల్'కు దుకాణం అప్పగిస్తావో.. వాటా ఇస్తావో ఏదో ఒకటి తేల్చుకోవాలని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. తాగినోళ్లకు తాగినంత మందు పోసి మత్తులో ఊగేలా ప్రభుత్వం కొత్త పాలసీతో నేటి నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు తెరుచుకోనున్నాయి.

– సాక్షిప్రతినిధి కర్నూలు

- దూకుడు పెంచిన మద్యం సిండికేట్
- దుకాణాలన్నింటినీ గుప్పిట్లోకి తీసుకునే యత్నం
- దుకాణదారులకు టీడీపీ నేతల నుంచి బెదిరింపులు
- వాటా లేదా, గుడ్‌విల్‌కు ఇవ్వాలని ఒత్తిడి
- ఎమ్మిగనూరు, కోడుమూరు, పత్తికొండ, బనగానపల్లెలో ఇదే తీరు
- బెదిరింపులతో కొందరు దుకాణాలను 'గుడ్‌విల్'కు ఇచ్చేసిన వైనం
- నేటి నుంచి అందుబాటులోకి ప్రైవేటు మద్యం దుకాణాలు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇక మద్యం జాతర మొదలవ్వనుంది. రెండేళ్లపాటు మందుబాబులు మత్తులో తూగేలా కావాల్సిన బ్రాండ్లను ప్రభుత్వమే సరఫరా చేయనుంది. మందుబాబుల ఆరోగ్యం, శాంతిభద్రతల సమస్య ఇవేవీ అక్కర్లేదు. మొన్నటి ఎన్నికల్లో భారీగా ఖర్చుపెట్టిన గెలిచిన ఎమ్మెల్యేలకు, వారి కోసం పని చేసిన శ్రేణులకు కాసుల పంట పండించడమే కొత్త మద్యం పాలసీ ప్రధాన లక్ష్యం! ఆ దిశగానే మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ పూర్తయింది. కర్నూలు జిల్లాలో 99, నంద్యాల జిల్లాలో 105 మొత్తంగా 204 దుకాణాలు బుధవారం తెరుచుకోనున్నాయి. ఉదయం 10 నుంచి నుంచి రాత్రి 10 గంటల వరకు విక్రయాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కాగా ఇప్పటికే లైసెన్స్‌దారులుమొదటి విడత లైసెన్స్ ఫీజుతో పాటు మద్యం స్టాకు డీడీలు తీశారు. ప్రైవేటు మద్యం దుకాణాలను 14 నియోజకవర్గాల్లోనూ తమ గుప్పిట్లోకి తీసుకుని నడిపించాలని టీడీపీ నేతలు భావించారు. అందుకు తగ్గట్లుగానే దరఖాస్తుల ప్రక్రియ మొదలైనప్పటి నుంచి కొందరు నేతలు సిండికేట్‌గా మారి బెదిరింపులకు దిగారు. దీంతో మొదట తక్కువ సంఖ్యలో దరఖాస్తులు నమోదయ్యాయి. అయితే బెదిరింపులు పెరగడంతో ఏదైతే అదవుతుందనే.. ధైర్యంతో చాలా మంది వ్యాపారులు దరఖాస్తులు వేశారు. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసే అవకాశం ఉండటంతో టీడీపీ నేతలు ఏమీ చేయలేకపోయారు. అయితే లాటరీలో 'కూటమి'తో పాటు తటస్తులకు కూడా దుకాణాలు దక్కాయి. దీంతో సిండికేట్ అయ్యేందుకు ఎమ్మెల్యేలు వారి ప్రధాన అనుచరులకు బాధ్యతలు అప్పగించి లైసెన్స్‌దారులతో సంప్రదింపులు చేస్తున్నారు. సామదానదండోపాయాలన్నీ ప్రదర్శిస్తున్నారు. నంద్యాలలో మంత్రి ఫరూక్ కుమారుడు ఫిరోజ్‌కు భయపడి ఇద్దరు రూ.20 లక్షల గుడ్‌విల్‌కు దుకాణాలను విక్రయించినట్లు తెలుస్తోంది. బనగానపల్లె, డోన్, కోడుమూరు, పాణ్యం, శ్రీశైలం, ఆళ్లగడ్డ, పత్తికొండతో పాటు దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ ఇదే తంతు నడుస్తోంది. 'గుడ్‌విల్'కు దుకాణం అప్పగించాలని, లేదంటే దుకాణాల్లో వాటా ఇవ్వాలని బెదిరిస్తున్నారు. కొందరు 25 శాతం వాటా తమకు ఇవ్వాలని ప్రతిపాదిస్తుంటే, ఇంకొందరు 75శాతం షేర్ తమకు ఇచ్చి 25 శాతం లైసెన్స్‌దారుడు ఉంచుకోవాలని ఒత్తిడి తెస్తున్నారు. ఈ ప్రక్రియకు కొన్ని చోట్ల ఎక్సైజ్ అధికారులు టీడీపీకి పూర్తిగా మద్దతు పలుకుతున్నారు. 'ఎమ్మెల్యేతో ఎందుకు వివాదం, దుకాణం ఇస్తే సరిపోతుంది. లేదంటే నిబంధనల పేరుతో షాపును మూయించాలని మాపై ఒత్తిడి ఉంది. నష్టపోతారు. ఆలోచించుకోండి!' అంటూ చెబుతున్నారు. దీన్నిబట్టి టీడీపీ నేతలు ఏ స్థాయిలో ఒత్తిడి తెస్తున్నారో స్పష్టం అవుతోంది. అయితే కొందరు మాత్రం టీడీపీ నేతల బెదిరింపులకు లొంగకుండా దుకాణం తెరిచేందుకు సిద్ధమయ్యారు. ఒకవేళ వివాదం చేస్తే ప్రజలకు తెలిసేలా చేద్దాం అంతేగానీ చాటుమాటున బెదిరి ఇవ్వాల్సిన అవసరం లేదనే ధీమాతో దుకాణాలు తెరిచేందుకు సిద్ధమయ్యారు.



ఐఎంఎల్ డిపో నుంచి దుకాణాలకు మద్యం కేటాయిస్తున్న దృశ్యం

దుకాణాలకు భారీ డిమాండ్..

లైసెన్స్‌దారులు దుకాణాల కోసం గదుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిబంధనలకు అనువుగా దుకాణాలు ప్రారంభించాలి. పైగా ఒకరోజు మాత్రమే గడువు ఉండటంతో పట్టణాల్లో అనువైన షాపుల కోసం జల్లెడ పడుతున్నారు. కొందరు మద్యం దుకాణాలకు అద్దెకు ఇచ్చేందుకు భారీగా అద్దె చెబుతున్నారు. కర్నూలులో ఒక్కో దుకాణానికి రూ.50వేల నుంచి రూ.1.50లక్షల వరకూ అడుగుతున్నట్లు తెలుస్తోంది. కృష్ణానగర్, ఎన్‌ఆర్‌పేట, ప్రకాశ్‌నగర్, బళ్లారి చౌరస్తా, కృష్ణానగర్, చెక్‌పోస్టు, సీక్యాంపులో భారీగా అద్దెలు చెబుతున్నారు.



ఇవీ టీడీపీ నేతల ఒత్తిళ్లు!:

- బనగానపల్లెలో టీడీపీతో పాటు కొన్ని దుకాణాలు తటస్తులు దక్కించుకున్నారు. 'గుడ్‌విల్'కు షాపులు ఇవ్వాలని లేదంటే 25 శాతం వాటా ఇవ్వాలని బెదిరిస్తున్నారు. లేదంటే దుకాణానికి గదులు లేకుండా చేస్తామని మంత్రి బీసీ అనుచరులు బెదిరిస్తున్నారు.
- డోన్‌లో 16 దుకాణాలు ఉన్నాయి. ఇందులో ధర్మవరం సుబ్బారెడ్డికి 3, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ వర్గానికి 2,పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత వర్గానికి రెండు,ఎస్వీ రెడ్డి కుమారైకు ఒకటి,తక్కిన 8 దుకాణాలు ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి వర్గం దక్కించుకుంది. వీరంతా కూటమి నేతలే కావడంతో సిండికేట్‌గా ఏర్పడి ధరలుపెంచి విక్రయించేందుకు సిద్ధమయ్యారు.
- కోడుమూరులో టీడీపీ ఇన్‌చార్జ్ విష్ణువర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే దస్తగిరి అనుచరులు సిండికేట్‌గా ఏర్పడి దుకాణాలు దక్కించుకునే పనిలో ఉన్నారు. లైసెన్స్‌దారులతో సంప్రదింపులు చేస్తున్నారు.
- నంద్యాలలో దుకాణం నడిపే ప్రతీ ఒక్కరూ 30 శాతం కమీషన్ ఇవ్వాలని మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ కుమారుడు ఫిరోజ్ బెదిరిస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.
- పాణ్యం నియోజకవర్గంలో 6 దుకాణాలు టీడీపీ వర్గానికి దక్కాయి. తక్కినవి ఇతరులకు దక్కించుకున్నారు. వీరితో గౌరు వర్గం సంప్రదింపులు చేస్తోంది.
- పత్తికొండలో దుకాణాలు దక్కించుకున్న టీడీపీ యేతర వారితో కేఈ వర్గం మాట్లాడుతోంది.
- ఆలూరు నియోజకవర్గంలో గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం వర్గం బెదిరింపులకు దిగుతోంది. తమను వచ్చి కలవాలని హుకూం జారీ చేస్తోంది.
- శ్రీశైలంలో ఎమ్మెల్యే బుడ్డాను కాదని దుకాణాలు దక్కించుకున్న వారు ఎమ్మెల్యేను కలిసిన తర్వాత దుకాణాలు ప్రారంభించాలని లైసెన్స్ దారులకు బుడ్డా అనుచరులు తేల్చిచెప్పారు.

విజయడెయిరీలో ఎమ్మెల్యే అఖిలప్రియ హల్‌చల్

- చైర్మన్ సీట్‌లో కూర్చొని హంగామా



చైర్మన్ సీటులో కూర్చుని మాట్లాడుతున్న ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిల ప్రియ

నంద్యాల(అర్బన్): ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ మరోసారి తన నోటికి పని చెప్పారు. ఆమెకు సంబంధంలేని విషయంలో స్పందిస్తూ రెచ్చగొట్టేలా మాట్లాడి ఘర్షణలకు ఊతమిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని విజయ డెయిరీలో మంగళవారం మధ్యాహ్నం ఆమె హల్‌చల్ చేశారు. మందిమార్బలంతో డెయిరీ ప్రాంగణంలోని చైర్మన్ గదిలోకి వెళ్లారు. డెయిరీలో ఏం జరుగుతుందో చెప్పాలని, ఇక్కడి అక్రమాలు తన దృష్టికి వచ్చాయని, వాటి మీద ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని ఉద్యోగులపై ప్రశ్నల వర్షం కురిపించారు. విషయం తెలుసుకున్న డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్ రెడ్డి ఎమ్మెల్యేకు ఫోన్ చేశారు. తాను లేని సమయంలో కార్యాలయానికి వచ్చి తన సీటులోనే కూర్చోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో అఖిలప్రియ రెచ్చిపోయారు. డెయిరీ ఆవరణలో ఏర్పాటు చేస్తున్న నూతన శిలాఫలకాల ఏర్పాటుపై తనకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని ప్రశ్నించారు. ఇప్పుడే ఇలాంటి కార్యక్రమాలు చేయాల్సిన అవసరం ఏముందని ఆగ్రహం వ్యకం చేశారు. తనతో ఏమైనా సమస్యలుంటే రాత పూర్వకంగా ఫిర్యాదు చేసుకోవాలని అఖిల సూచించారు. 'నాతో మామగా మాట్లాడుతున్నావా... లేక చైర్మన్‌గా మాట్లాడుతున్నావా.. మామవైతే నీ సీట్లో కూర్చుంటే తప్పేముంది. మీ ఇష్టం వచ్చినట్లు డెయిరీ నిర్వహణ చేస్తే చూస్తూ ఊరుకుంటామని అనుకోకండి. నాకు ఎందుకు ఫోన్ చేశావ్ అసలు.. మీ సీట్లో కూర్చోవడం ఇబ్బందైతే అదే విషయాన్ని రాత పూర్వకంగా ఫిర్యాదు చేసుకో' అంటూ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే నంద్యాలకు వచ్చి రాజకీయాలు చేయడం ఏంటని స్థానిక టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆమె పరిధిలో రాజకీయాలు చేసుకోవాలని.. తమ పరిధిలోకి వచ్చి పెత్తనం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని చెబుతున్నారు.

సీసీ రోడ్ల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టండి

- పీఆర్ ఎస్ఈ రామచంద్రారెడ్డి

కర్నూలు (అర్బన్): జిల్లాలో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణాల్లో పూర్తి నాణ్యత ఉండాలని పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజనీర్ వి.రామచంద్రారెడ్డి కోరారు. మంగళవారం సాయంత్రం జిల్లాపరిషత్ ప్రాంగణంలోని పీఆర్ఎస్ఈ కార్యాలయంలో కర్నూలు డివిజన్‌కు సంబంధించి ఈఈ, డీఈఈలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రూ.67 కోట్లతో 832 సీసీ రోడ్ల పనులు మంజూరయ్యాయని, ఈ పనులపై సంబంధిత ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఉండాలన్నారు. నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా డిసెంబర్ నెలాఖరు నాటికి ఈ పనులను పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఈ పనులకు సంబంధించి నిధులకు ఎలాంటి కొరత లేదని, పూర్తయిన పనులకు అనుగుణంగా ప్రతి గురువారం నిధులు విడుదలవుతాయని చెప్పారు. సమావేశంలో కర్నూలు ఈఈ మద్దన్న, డీఈఈలు బండారు శ్రీనివాసులు, శేషయ్య, నాగిరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, కర్రెన్న, రవీంద్రారెడ్డి, లక్ష్మీనారాయణ, హెచ్‌డీ ఈరన్న, ఏఈలు హాజరయ్యారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- ఉత్తమ ఉపాధ్యాయులతో వర్చువల్ బోధనకు ఏర్పాటు చేయండి
- మున్సిపల్ హైస్కూల్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ పి.రంజిత్ బాషా



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు సిటీ: వచ్చే మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులందరూ ఉత్తీర్ణులు అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం స్థానిక దామోదరం సంజీవయ్య స్మారక మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. స్కూల్ ఆవరణలోని బాలబాలికలతో సంభాషించారు. భోజనం చేశారా? మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజనం అందిస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్కూల్ టీచర్లతో సమావేశమై బోధన, పిల్లల సామర్థ్యం, ఉత్తీర్ణత తదితర అంశాల గురించి చర్చించారు. పిల్లల హాజరు నమోదు, గైర్హాజరైతే ఎందుకు రాలేదని తెలుసుకుంటున్నారా? అని హెచ్ఎం, టీచర్లను ప్రశ్నించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులందరూ పాసయ్యేలా చూడాలని, ఉత్తమ ఫలితాల సాధనకు ఉత్తమ టీచర్లను ఎంపిక చేసి వర్చువల్‌గా తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని డీఈఓ శామ్యూల్‌కు సూచించారు. స్కూళ్లలో పదవ తరగతి విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా షెడ్యూల్‌ను రూపొందించి అమలు చేయాలని, ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులు చదవడం, రాయడం వంటి కనీస నైపుణ్యాలు సాధించే విధంగా బోధన పద్ధతులు ఉండాలన్నారు. మునిసిపల్ కమిషనర్ రవీంద్రబాబు, ఆర్డీఓ సందీప్‌కుమార్, అర్బన్ తహసీల్దారు వెంకటలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

ఇక 'సాగునీటి' రాజకీయం

- నేడు సాగునీటి సంఘాల ఎన్నికకు నోటిఫికేషన్
- రైతు ఓటర్ల జాబితా సిద్ధం చేస్తున్న రెవెన్యూశాఖ
- తుంగభద్ర ప్రాజెక్టు పరిధిలో 58 సంఘాలు
- గాజులదిన్నె ప్రాజెక్టుకు 12 సంఘాలు
- నవంబర్ 22న ప్రాజెక్టు కమిటీల ఎన్నిక

ఎమ్మిగనూరు: జల రాజకీయాలకు కూటమి ప్రభుత్వం తెర తీసింది. అధికార దర్పంతో రైతుల సాగునీటి అవసరాలపై పెత్తనం చెలాయించేందుకు మళ్లీ సాగునీటి సంఘాలను ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈనెల 16 నోటిఫికేషన్ వెలువడుతుండటంతో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సిద్ధమవుతున్నారు. మరో వైపు రైతుల భాగస్వామ్యంతో నడవాల్సిన సంఘాలకు రాజకీయ రంగులద్దేందుకు తమ్ముళ్లు తలమునకలయ్యారు. కర్నూలు జిల్లాలో ప్రధాన సాగునీటి వనరైన తుంగభద్ర దిగువ కాలువ (టీబీపీ ఎల్లెల్సీ), గాజులదిన్నె ప్రాజెక్టుల పరిధిలోని టీసీ మెంబర్లు, వాటర్ యూజర్స్ అసోషియేషన్ (డబ్ల్యూయూఏ)లు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ)లతో పాటు తుంగభద్ర ప్రాజెక్టు కమిటీ, గాజులదిన్నె ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు ఆయకట్టు రైతులు, భూ వివరాలు సిద్ధం చేస్తున్నారు. నోటిఫికేషన్ విడుదలైన రోజు నుంచే సాగునీటి సంఘాల ఓటర్ల జాబితా తయారీలో అధికార యంత్రాంగం నిమగ్నం కానుంది. టీసీ మెంబర్ల ఎన్నిక, డబ్ల్యూయూఏ, డీసీ, పీసీ కమిటీలకు అంచెలంచెలుగా ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 22న జరిగే ప్రాజెక్టు కమిటీల ఎన్నికతో సాగునీటి వినియోగదారుల సంఘాల ఏర్పాటు ప్రక్రియ ముగుస్తోంది. 2015లో సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరిగాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలన్నింటినీ రైతుభరోసా కేంద్రాల ద్వారానే పారదర్శకంగా చేపట్టారు. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు సాగునీటి సంఘాల పేరుతో రైతుల మధ్య చిచ్చురేపేలా వ్యవహరిస్తున్నారని రైతు సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. అధికార తెలుగుదేశం కూటమి నేతలే సాగు నీటి సంఘాల ప్రతినిధులుగా ఉండేలా ముందస్తు పావులు కదుపుతుండగా, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సైతం పచ్చజెండా ఊపేందుకు సిద్ధమయ్యారు. హొళగుంద (డీసీ-1), కౌతాళం (డీసీ-2), కోసిగి (డీసీ -3), పెద్దకడబూరు (డీసీ-4), ఎమ్మిగనూరు డీసీ-5, డీసీ-6), గోనెగండ్ల (డీసీ-7), కోడుమూరు(డీసీ-8), కర్నూలు (డీసీ-9, డీసీ-10) కమిటీలు ఏర్పాటు అవుతాయి.

ఎల్లెల్సీ పరిధిలో..

జిల్లా రైతాంగానికి ప్రధాన సాగునీటి వనరైన తుంగభద్ర దిగువ పరిధిలో ఖరీఫ్, రబీ సీజన్‌లో 1,51,134 ఎకరాలు సాగునీరందుతోంది. ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు, కర్నూలు నియోజకవర్గాల పరిధిలోని ఆయకట్టు భూములకు ఎల్లెల్సీ నీరే ప్రధానం. తుంగభద్ర ప్రాజెక్టు పరిధిలో మొత్తం 58 సాగునీటి సంఘాలు (డబ్ల్యూయూఏ), 10 డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ)లతోపాటు తుంగభద్ర ప్రాజెక్టు కమిటీ (పీసీ)ని ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేశారు.



తుంగభద్ర దిగువ కాలువ

కమిటీలకు ఎన్నికలు ఇలా...


సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు రైతుల ఓటర్ల జాబితాను ఆయా మండలాల తహసీల్దార్ల ఆధ్వర్యంలో రూపొందిస్తారు.

- రైతులు తమ పరిధిలో ఒకరిని టీసీ (టెరిటోరిల్ కాంటెన్సీ) మెంబర్‌గా ఎన్నుకుంటారు.
- 12 మంది టీసీ మెంబర్లు కలసి ఒక సాగునీటి సంఘం (డబ్ల్యూయూఏ) ఏర్పాటు అవుతోంది. అందులో అధ్యక్షుడు, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు.
- డిస్ట్రిబ్యూటరీ (ఉప కాలువ) పరిధిలోని డబ్ల్యూయూఏ లంతా కలసి వారిలో ఇద్దరిని డీసీ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు.
- 10 మంది డీసీ అధ్యక్షులు వారిలో ఇద్దరిని తుంగభద్ర ప్రాజెక్టు కమిటీ అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు.
- అదేవిధంగా గాజులదిన్నె ప్రాజెక్టు పరిధిలోని 12 డబ్ల్యూయూఏ సంఘాలతో ప్రాజెక్టు కమిటీ ని ఎన్నుకుంటారు. రాంపురం కాలువకు డబ్ల్యూ యూఏ కమిటీని మాత్రమే ఎన్నుకుంటారు.
- ఎన్నికైన పాలకవర్గ సభ్యులు తమ పరిధిలోని ఆయకట్టు నిర్వహణ, సాగునీటి పంపిణీ, అభివృద్ధి పనులపై పర్యవేక్షణ ఉంటుంది.

దశల వారీగా ఎన్నికల నిర్వహణ

ఈనెల 16 బుధవారం నుంచి సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభిస్తోంది. నెల రోజుల తర్వాత నవంబర్ 16 నుంచి ఎన్నికల ప్రక్రియ ఉంటుంది. నవంబర్ 10వ తేదీలోపు ఓటర్ల జాబితా రూపొందించడం, అభ్యంతరాలుంటే సరిచేయటం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. నవంబర్ 14న జిల్లా కలెక్టర్ నేతృత్వంలో వివిధ పార్టీలు, రైతు సంఘాల నేతలతో సమావేశం, 15న తుది ఓటర్ల జాబితా ప్రచురణ జరుగుతాయి. నవంబర్ 16 నుంచి దశల వారీగా ఎన్నికలు మొదలవుతాయి. ముందుగా టీసీ అధ్యక్ష, ఉపాధ్యక్షులను తహసీల్దార్ లేదా ఏఈల పర్యవేక్షణలో చేపడతారు. డబ్ల్యూయూఏ కమిటీలను డీఈఈ స్థాయి అధికారుల పర్యవేక్షణలో, డీసీలకు ఆర్డీవో, ఈఈల నేతృత్వంలో ఎన్నికలు నిర్వహిస్తారు. ప్రాజెక్టు కమిటీల ఎన్నికలను జాయింట్ కలెక్టర్, ఎస్ఈల నేతృత్వంలో నిర్వహిస్తారని ఎల్లెల్సీ ఇన్‌చార్జ్ ఈఈ శైలేశ్వర్ తెలిపారు.

గాజులదిన్నె పరిధిలో...



24,372 ఎకరాలకు సాగునీరందించే గాజులదిన్నె ప్రాజెక్టు పరిధిలో 12 సాగు నీటి సంఘాలతో ప్రాజెక్టు కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టు పరిధిలో సాగునీరందే గోనెగండ్ల, కోడుమూరు, దేవనకొండ, కృష్ణగిరి మండలాలకు చెందిన రైతులు ఓటర్లుగా ఉంటారు. మంత్రాలయం నియోజకవర్గంలో మైనర్ ఇరిగేషన్ పరిధిలోని రాంపురం కాలువకు ఒక సాగునీటి సంఘం ఎన్నిక జరగనుంది.

ఇసుక రీచ్‌లతో అన్నీ నష్టాలే

- ప్రజాభిప్రాయ సేకరణలో గుడికంబాలి గ్రామస్తులు



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నవ్య

కౌతాళం: ఇసుక రీచ్‌లతో గ్రామాలకు అన్నీ నష్టాలతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గుడికంబాలి గ్రామస్తులు జేసీ నవ్య దృష్టికి తీసుకెళ్లారు. మండల పరిధిలోని గుడికంబాలి, మరళి, నదిచాగి గ్రామాల్లో జిల్లా కాలుష్య మండలి, మైనింగ్, పర్యవరణ శాఖ అధికారులు ఆయా గ్రామాల్లో ఇసుక రీచ్‌ల ఏర్పాటుపై మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా గుడికంబాలి గ్రామస్తులు మాట్లాడుతూ ఇసుక రీచ్‌ల వల్ల లారీలు అధిక లోడుతో వెళ్లడంతో రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో పాటు దుమ్ము, ధూళి వల్ల రోడ్డు పక్కన ఉన్న పంట పొలాలు పనికి రాకుండా పోతున్నాయన్నారు. గ్రామాల రోడ్లు పూర్తిగా దెబ్బతినడంతో బస్సు సర్వీసులు పూర్తిగా నిలిచిపోయాయని తెలిపారు. తమ పిల్లలు చదువుకునేందుకు హాల్వి గ్రామానికి కాలినడకన పోతున్నారని, ఆ సమయంలో ఇసుక లారీలు ఢీకొంటే ఎవరు బాధ్యత అని ప్రశ్నించారు. పాఠశాలల సమయాల్లో ఇసుక లారీలు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నదీతీరంలో వేసిన బోర్లు ఇసుక తవ్వకాలతో ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. ఇసుక రీచ్‌లలో ఆయా గ్రామాలకు చెందిన ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జేసీ హామీ ఇచ్చారు. సమావేశంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, కాలుష్య నియంత్రణ అధికారి కిషోర్‌రెడ్డి, డీడీ మైనింగ్ రవిచంద్, తహసీల్దార్ మల్లికార్జునస్వామి, వీఆర్వో నాగార్జునలు ఉన్నారు.

క్లుప్తంగా

శ్రీశైలంలో 209 టీఎంసీలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైల జలాశయంలో మంగళవారం సాయంత్రం సమయానికి 209.1579 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూరాల, సుంకేసుల నుంచి 1,23,314 క్యూసెక్కుల వరద ప్రవాహం జలాశయానికి వస్తుండగా ఇక్కడి నుంచి దిగువ ప్రాజెక్ట్‌లకు 77,078 క్యూసెక్కులు విడుదల చేశారు. కుడిగట్టు కేంద్రంలో 15.015 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 16.415 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేశారు. ప్రస్తుతం డ్యాం నీటిమట్టం 883.90 అడుగులకు చేరుకుంది.

శ్రీశైల దేవస్థానం ఏఈఓపై వేటు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం దేవస్థానం సహాయ కార్య నిర్వహణ అధికారి ఎం.ఫణీధర ప్రసాద్‌పై వేటు పడింది. ఆయనను సస్పెండ్ చేస్తూ దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏఈఓ ఎం.ఫణీధర ప్రసాద్ గతంలో దేవస్థాన రెవెన్యూ విభాగపు ఏఈఓగా విధులు నిర్వహించిన సమయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని, దేవస్థానం ఆదాయానికి నష్టం చేకూర్చారని తదితర అభియోగాలతో హిందూ జనశక్తి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు లలిత్ కుమార్ దేవదాయ శాఖ ఉన్నతాధికారులకు, కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. విచారణలో అభియోగాలు నిజమని తేలడంతో దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఏఈఓ ఎం.ఫణీధర ప్రసాదును సస్పెండ్ చేశారు.

బీరవోలు వాసి మృతదేహం కేసీలో లభ్యం

జూపాడుబంగ్లా: పగిడ్యాల మండలం బీరవోలు గ్రామానికి చెందిన పూర్జకంటి రవికుమార్ (24) అనే వ్యక్తి మృతదేహం మంగళవారం తరిగోపుల గ్రామ సమీపంలోని కేసీ కాల్వలో లభ్యమైంది. ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 12వ తేది రాత్రి ఇంట్లో భోజనం చేసి బయటకు వచ్చిన రవికుమార్ తిరిగి ఇంటికి వెళ్లలేదు. ఆచూకీ కోసం తండ్రి చిన్నకూర్మయ్య బంధువులకు ఫోన్ చేసి ఆరా తీశాడు. అయితే, ఎక్కడా లేడని సమాధానం రావడంతో కేసీ కాల్వ వెంట గాలించ సాగారు. మంగళవారం తరిగోపుల గ్రామ సమీపంలోని కేసీ కాల్వలో మృతదేహం కొట్టుకెళ్తుండగా గుర్తించి ఒడ్డుకు చేర్చారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడు రవికుమార్ కేసీలో పడి ఆత్మహత్య చేసుకున్నాడా లేక ఎవ్వరైనా చంపి కాల్వలో పారవేశారా అనే విషయం దర్యాప్తులో తేలనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అడిషనల్ డీఎంఈ పదోన్నతికి లైన్‌క్లియర్

- 50 మంది జాబితా తెప్పించుకున్న ప్రభుత్వం
- డాక్టర్ ప్రభాకర్‌రెడ్డికి దక్కని చోటు

కర్నూలు(హాస్పిటల్): బోధనాసుపత్రుల్లో పనిచేసే వైద్యులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అడిషనల్ డీఎంఈల పదోన్నతుల ప్రక్రియ దాదాపు పూర్తి కావచ్చింది. ఇందుకు సంబంధించి జాబితాను రూపొందించే పనిలో రాష్ట్ర ఉన్నతాధికారులు ఉన్నారు. ఈ మేరకు గత ఆగస్టు నెలలో రూపొందించిన మేరకు సీనియారిటీ జాబితాలోని మొదటి 50 మందికి సంబంధించిన వివరాలు పంపించాల ని కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్‌కు రాష్ట్ర ఉన్నతాధికారులు కోరి తెప్పించుకున్నారు. అయితే ఇందులో ప్రస్తుతం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఫుల్ అడిషనల్ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి కి చోటు దక్కకపోవడం గమనార్హం. ఆయనే సూపరింటెండెంట్‌గా కొనసాగాలన్న భావనతో గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆసుపత్రిలో చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా 50 మందితో కూడి న జాబితాపై ఉన్నతాధికారులు వివరాలు తెప్పించుకోవడంపైనా ఆసుపత్రిలో వైద్యుల మధ్య చర్చకు దారి తీసింది. కాగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి 56వ స్థానంలో ఉండటంతో 50 మంది జాబితాలో ఆయన వివరాలను కళాశాల అధికారులు పంపించలేదు. 50 మంది జాబితాలో ఉన్న ఒకరు ఆసుపత్రికి సూపరింటెండెంట్‌గా వచ్చే అవకాశాలు ఉన్నాయని కళాశాలలో చర్చ నడుస్తోంది.

అనెస్తీషియా..అదో మాయ!

- నొప్పి తెలియకుండా ఆపరేషన్లు
- పెయిన్ క్లినిక్‌లకు పెరుగుతున్న ఆదరణ
- పెద్దాసుపత్రిలో ప్రతి ఏటా 30 వేల శస్త్రచికిత్సలు
- నేడు ప్రపంచ అనెస్తీషియా దినం

రోగికి నొప్పి తెలియకుండా ఆపరేషన్ చేయడం వైద్యశాస్త్రంలో అద్భుతంగా చెప్పవచ్చు. నఖ, శిఖ పర్యంతమూ శరీరంలోని ప్రతి అవయవానికి చేసే ఆపరేషన్‌కు ముందు మత్తు మందు ఇస్తారు. దీనివల్ల రోగికి ఎలాంటి నొప్పి భావన ఉండదు. నేడు ప్రపంచ అనెస్తీషియా దినం నేపథ్యంలో ప్రత్యేక కథనం.

కర్నూలు(హాస్పిటల్): పూర్వం మత్తు మందు రాని రోజుల్లో రోగికి ఆపరేషన్ చేయాలంటే అనేక పద్ధతులు అవలంభించేవారు. మత్తు రావడానికి తలపై గట్టిగా కొట్టడం, పాములతో కరిపించడం, వివిధ రకాల మత్తు పదార్థాలు తినిపించడం లేదా గట్టిగా చేతులతో పట్టుకుని ఆపరేషన్ చేయడం చేసేవారు. మత్తు మందు కనిపెట్టాక ఒక చిన్న సూదితో శరీరంలో మత్తు ఎక్కించేసి ఆపరేషన్ చేస్తున్నారు. జిల్లాలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అనెస్తీషియా విభాగం ఉంది. ఇందులోని మూడు యూనిట్లలో ముగ్గురు ప్రొఫెసర్లు, నలుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు, 18 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు. వీరితో పాటు ప్రస్తుతం 39 మంది పీజీ వైద్య విద్యార్థులు చదువుతూ రోగులకు సేవ చేస్తున్నారు. ఇందులో ఎక్కువగా మహిళలే ఉండటం విశేషం. ఇక్కడి 24 ఆపరేషన్ థియేటర్లలో ప్రతి ఏడాది 30వేల దాకా చిన్నా, పెద్దా ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో 145 మందికి పైగా అనెస్తీషియా వైద్యులు సేవలు అందిస్తున్నారు. ఆపరేషన్‌కు ముందు రోగికి నొప్పి తెలియకుండా మత్తు మందు ఇచ్చేది అనెస్తీషియా వైద్యులే. కేవలం మత్తు మందు ఇవ్వడమే కాదు రోగి కోలుకునేంత వరకు దగ్గరుండి పర్యవేక్షిస్తారు. రోగి త్వరగా కోలుకున్నాడంటే అందులో మత్తు మందు వైద్యుని పాత్ర అధికంగా ఉంటుంది. ఇటీవల కాలంలో ముగ్గురు రోగులకు కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు, ఒకరికి అవయవదానానికి సంబంధించి ఆపరేషన్ నిర్వహించి అవయవాలను సేకరించి ఇతర ప్రాంతాలకు పంపించారు. కాగా ఇటీవల కాలంలో కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో నొప్పులు లేకుండానే ప్రసవాలు చేస్తున్నారు. దీనినే వైద్య పరిభాషలో పెయిన్‌లెస్ లేబర్ అని పిలుస్తున్నారు.


ఆపరేషన్ థియేటర్‌లో సర్జరీ చేస్తున్న వైద్యులు

ఐసీయూలో ముఖ్యపాత్ర

రోగి ప్రాణాపాయస్థితిలో అత్యవసర చికిత్స అవసరమై, అపస్మారక స్థితిలో ఉన్నప్పుడు అనెస్తెటిస్ట్ కీలక పాత్ర పోషిస్తారు. క్రిటికల్ కేర్ విభాగం(ఐసీయూ)లో కీలకమైన వైద్యులు వారే. రోగి ఆహారం తీసుకోలేని స్థితిలో ఉన్నప్పుడు సిరలు, జీర్ణవాటిక ద్వారా ప్రత్యేక రీతిలో శరీరానికి అవసరమైన పిండి, మాంసకృతులు ఇతర అత్యవసర పోషక పదార్థాలను శరీరానికి అందేలా ఏర్పాట్లు చేసేది అనెస్తీషియా వైద్యులే. రోగికి మత్తు మందు ఇవ్వడమే గాక అత్యవసర చికిత్సలో ప్రాణాలను కాపాడేందుకు తన శాయశక్తులా కృషి చేస్తారు.


మత్తు సూది

పెయిన్‌క్లినిక్‌ల కీలక పాత్ర

దీర్ఘకాలిక నొప్పులకు చికిత్స చేయడానికి పెయిన్ క్లినిక్స్ అందుబాటులోకి వచ్చాయి. పెయిన్ క్లినిక్స్‌లో దీర్ఘకాల నొప్పులకు ఆధునిక పరికరాలు (ఎక్స్‌రే మిషన్, సిటీ స్కానింగ్ మిషన్, అల్ట్రాసౌండ్ మిషన్, రేడియోఫ్రీక్వెన్సీ అబ్లేషన్ మిషన్)ను ఉపయోగించి కుట్లులేని ప్రత్యేకమైన ఇంజెక్షన్ల ద్వారా నొప్పి తగ్గిస్తారు. ఇందులో భాగంగా నడుం నొప్పికి, మోకాలునొప్పికి, మెడనొప్పికి, తలనొప్పికి, క్యాన్సర్ నొప్పులకు చికిత్స చేసి నొప్పి తగ్గిస్తారు. సాధారణ కాన్పుల వల్ల కలిగే నొప్పులకు లేబర్ అనెల్జిషియా పద్ధతితో నొప్పిలేని కాన్పుగా చేస్తారు. ఇప్పటికే కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో పెయిన్‌లెస్ లేబర్(నొప్పిలేని కాన్పు)విధానాన్ని అనుసరిస్తున్నారు.

ఏటా 30వేల మందికి ఆపరేషన్లు



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని మొత్తం 24 ఆపరేషన్ థియేటర్లలో ప్రతి సంవత్సరం 30వేలకు పైగా ఆపరేషన్లు నిర్వహిస్తుంటాము. ఇందులో 20 వేలు మేజర్, 10వేలు మైనర్ ఆపరేషన్లు ఉంటున్నాయి. ఆపరేషన్ సమయంలో రోగులకు మత్తు మందు ఇవ్వడంతో పాటు నాన్ ఆపరేటింగ్ రూమ్ అనెస్తీషియా(నోరా)కు సంబంధించి ఎంఆర్ఐ, ఈఆర్‌సీపీ, ఈసీటీ, పల్మనాలజిలో చెస్ట్ థొరస్కోపీస్‌కు కూడా మా సేవలు అందిస్తున్నాము. ఇంటర్నీస్‌కు బీఎల్ఎస్, పీజీలకు ఏఎల్ఎస్ తరగతులు నిర్వహిస్తున్నాము.

–డాక్టర్ జి.సుధీర్‌కుమార్, ప్రెసిడెంట్, కర్నూలు సొసైటీ ఆఫ్ అనెస్తీషియాలజిస్టు, కర్నూలు

అనెస్తీషియా లేకపోతే కష్టమయ్యేది



వైద్యరంగంలోఅనెస్తీషియా చాలా కీలకమైనది. ప్రస్తుత వైద్యవిదానంలో అనెస్తీషియా మందు లేకపోతే అన్నఊహనే కష్టంగా ఉంటుంది.అనెస్తీషియా మందు రావడంతో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. అనెస్తీషియా లేకుండా ఆరోగ్యసంరక్షణ ఊహించడం దాదాపు అసాధ్యం. సాధారణ అనెస్తీషియాలో రోగులు అపస్మారక స్థితిలో ఉంటారు. వారు ఎలాంటి అనుభూతికి లోనుకారు. శ్వాసతీసుకోవడం, ఐవీ ద్వారా ఔషధాన్ని స్వీకరిస్తారు. అనెస్తీషియా విధానం రాకపోతే శస్త్రచికిత్సలు చేయడం కష్టమయ్యేది.

–డాక్టర్ బి. బాలప్రవీణ్‌కుమార్, అనెస్తెటిస్ట్, కర్నూలు

ఏపీఆర్ఎస్ఏ తాత్కాలిక జిల్లా అధ్యక్షుడిగా రామాంజనేయరెడ్డి

కర్నూలు(సెంట్రల్): ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ తాత్కాలిక జిల్లా అధ్యక్షుడిగా రామాంజనేయరెడ్డిని ఎన్నుకున్నారు. ప్రస్తుతం జిల్లా అధ్యక్షుడిగా ఉన్న వి.గిరికుమార్‌రెడ్డి వ్యక్తిగత కారణాలతో తన పదవికి రాజీనామా చేయడంతో ఆయన బాధ్యతలను అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న రామాంజనేయరెడ్డికి అప్పగించారు. కాగా, వి. గిరికుమార్‌రెడ్డి రాజీనామాను ఆమోదించాలని కోరుతూ జిల్లా కార్యదర్శి నాగరాజు అధ్యక్షతన కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సమావేశమైన సభ్యులు నిర్ణయం తీసుకున్నారు. త్వరలోనే నూతన అధ్యక్షుడి ఎన్నిక నిర్వహించాలని కూడా వారు అందులో విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కలెక్టరేట్ విభాగం అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరాజు, లోకేశ్వరరెడ్డి, ధనుంజయరెడ్డి, కర్నూలు డివిజన్ విభాగం అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, వేణుగోపాల్‌రావు, ఆదోని డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు రజనీకాంత్‌రెడ్డి, వలీబాషా, రామేశ్వరరెడ్డి, పత్తికొండ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, మల్లికార్జున పాల్గొన్నారు.


పాదముద్రలను పరిశీలిస్తున్న వెలుగోడు ఎఫ్ఆర్ఓ


చిరుత పాదముద్రలు

సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం

మిడుతూరు: చిరుతను గుర్తించేందుకు బుధవారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని వెలుగోడు ఫారెస్టు రేంజ్ అధికారి ఎంఏ ఖాన్ తెలిపారు. ఈనెల 14న సాయంత్రం చిరుత సంచరిస్తుందనే సమాచారంతో ఆయన మంగళవారం మిడుతూరు సమ్మర్ స్టోరేజ్ సమీపంలో పర్యటించారు. చిరుతవిగా భావిస్తున్న పాద ముద్రలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుత ఒకే చోట ఉండే జంతువు కాదన్నారు. ఎవరూ భయపడాల్సిన పని లేదన్నారు. ఆయన వెంట బీట్ ఆఫీసర్ శ్రీనివాసులు, బర్డ్ వాచర్ గఫూర్ ఉన్నారు.

సంపులో పడి బాలుడి మృతి

కర్నూలు (టౌన్): ఇంటి ముందు ఆడుకుంటూ సంపులో పడి ఓ బాలుడు మృతి చెందాడు. నగర శివారులోని జొహరాపురం ఇందిరమ్మ కాలనీలో మంగళవారం ఈ సంఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఇందిరమ్మ కాలనీలో ఖాసీం వలీ అనే వ్యక్తి ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. పనుల్లో భాగంగా అక్కడ సంపు ఏర్పాటు చేసుకున్నాడు. మంగళవారం కుమారుడు అయాన్ అలీ (6) ఇంటి బటయ ఆడుకుంటూ పొరపాటున అందులో పడిపోయాడు. కుటుంబసభ్యులు గమనించి బాలుడిని బయటకు తీసి వెంటనే కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు బాలుడి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో ఒకరి దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు

ప్యాపిలి: మండల పరిధిలోని ఏనుగుమర్రి వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. డోన్ పట్టణంలోని కొండపేటకు చెందిన విష్ణు(24), ఉంగరానిగుండ్ల గ్రామానికి చెందిన మధుతో కలిసి ద్విచక్రవాహనంపై డోన్ నుంచి గుత్తికి బయలుదేరారు. ఏనుగుమర్రి వద్దకు చేరుకోగానే ద్విచక్రవాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ప్రమాదంలో విష్ణు తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మధును చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ప్యాపిలి పోలీసులు తెలిపారు.

కొనసాగుతున్న వరద

కర్నూలు సిటీ: తుంగభద్ర నదికి వరద ప్రవాహం కొనసాగుతుంది. మంగళవారం ఎగువ నుంచి సుంకేసుల బ్యారేజీకి 65,630 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, ఇందులో కేసీ కెనాల్‌కి 1540 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అదే విధంగా 15 బ్యారేజీ గేట్లు పైకెత్తి దిగువకు 63,630 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఎగువ రాష్ట్రంలో గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వలన తుంగభద్ర డ్యాంకి ఈ నెల 4వ తేదీ నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆత్మకూరు: పట్టణంలోని శ్రీశైలం రోడ్డులో ఉన్న మదరసా వెనుక వైపు రేకుల షెడ్డులో మంగళవారం పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకటనారాయణరెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన ఏడుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి పేక ముక్కలు, రూ.1,03,000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు.


ఇనుప గొలుసును తెంపుతున్న గొరవయ్య బల్లూరు గాధిలింగప్ప


విగ్రహాలను కొండపైకి తీసుకెళ్తున్న దృశ్యం

డిర్ర్..గోపరాక్!

- గొరవయ్యల డమరుకాలతో హోరెత్తిన దేవరగట్టు
- ఇనుప గొలుసు తెంపేందుకు గొరవయ్యల పోటీ
- స్వామి సన్నిధానంలో దేవదాసీల క్రీడోత్సవం
- నేడు నెరణికి గ్రామానికి చేరనున్న ఉత్సవ విగ్రహాలు

హొళగుంద: వందలాది డమురుకులు, పిల్లనగ్రోవిల నాదంతో దేవరగట్టు మంగళవారం హోరెత్తింది. దసరా బన్ని ఉత్సవాలను రాష్ట్రంలోనే ప్రత్యేకంగా నిర్వహించే హొళగుంద మండలం దేవరగట్టులో వెలిసిన మాళ మల్లేశ్వరస్వామి సన్నిధానంలో మంగళవారం దసరా బన్ని ఉత్సవంలో రెండవ ప్రధాన ఘట్టమైన గొరవయ్యల నృత్యాలు, గొలుసు తెంపుట, దేవదాసీల క్రీడలు, వసంతోత్సవం, కంకణ విసర్జన, తదితర కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. జైత్రయాత్ర అనంతరం సింహాసన కట్టమీద కొలువుదీరిన మాళమల్లేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాల ముందు ఈ కార్యక్రమాలు కొనసాగాయి.

హోరెత్తిన 'దేవరగట్టు'

స్థానికులే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన గొరవయ్యలు కొండపై కొలువైన మాళ మల్లేశ్వరస్వామి మూలవిరాట్‌ను దర్శనం అనంతరం మల్లప్ప గుడిలోని సింహాసన కట్ట మీదున్న స్వామి వారి ఉత్సవమూర్తుల ముందు తమ సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. పిల్లనిగ్రోవి ఊదుతూ, త్రిశూలం చేతబట్టి, డమరుకాలను ఆడిస్తూ లయబద్ధంగా నృత్యం చేసే దృశ్యాలు భక్తులను అమితంగా ఆకట్టుకున్నాయి. గురు గొరవయ్యలు చాటిలతో కొట్టుకుంటూ ఉద్వేగంగా వచనాలు చెప్తూ పూనకంతో ఊగిపోయారు. పిల్లగొరవయ్యలు దైవ వచనాలు వల్లెవేస్తూ అందుకు తగ్గట్టు హావభావాలు ప్రదర్శిస్తూ నృత్యం చేసి భక్తులను ఆశ్చర్యపరిచారు.


మై మరిచి నృత్యం చేస్తున్న దేవదాసీలు

51 జరికలకు తెగిన గొలుసు

ఉత్సవంలో భాగంగా ఇనుప గొలుసు తెంపే కార్యక్రమం ఈ ఏడాది కొద్దిగా భక్తులను ఆందోళనకు గురి చేసింది. ప్రతిసారి రెండు, మూడు జరికలకు లేదా ఒక్కోసారి ఒకే దెబ్బకు తెగే గొలుసు ఈ సారి మొరాయించింది. హాలహర్వి మండలం బల్లూరు గ్రామానికి చెందిన గొరవయ్య గాదిలింగప్ప తీవ్రంగా శ్రమించి 20 కేజీల బరువున్న గొలుసును 51 జరికలకు తెంపడంతో భక్తులు ఈలలు, కేకలు వేస్తూ ఆనందంతో నృత్యం చేశారు.

ఆకట్టుకున్న దేవదాసీలు

దేవదాసీల క్రీడోత్సవం ఘనంగా జరిగింది. నెరణికి గ్రామానికి చెందిన ఓ సామాజిక వర్గం వారు బసివినులను ఎత్తుకుని నృత్యాలు చేశారు. అనంతరం వసంతోత్సవం, కంకణ విసర్జన కార్యక్రమాలను నిర్వహించారు. మాళమల్లేశ్వర విగ్రహాలతోపాటు పల్లకీని భక్తులు ఊరేగింపుతో కొండ పైనున్న ఆలయానికి తీసుకెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజలు, విగ్రహాల అలంకరణ అనంతరం తిరిగి కొండ దిగువన ఉన్న కాడప్ప మఠంలో కొలువుంచారు.

నేటితో ఉత్సవాలు ముగింపు

కాడప్ప మఠంలో ఉంచిన మాళ మల్లేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజల అనంతరం గొరవయ్యలు తిరిగి దేవరగట్టు నుంచి నెరణికి గ్రామానికి మోసుకెళ్తారు. అక్కడ పుర వీధుల్లో రాత్రి 12 గంటల వరకు విగ్రహాల ఊరేగింపు, చిన్నారుల మొగలాయిల మధ్య విగ్రహాలను ఉంచే ఆలయానికి చేరడంతో ఉత్సవాలు ముగుస్తాయి.

ఉపాధ్యాయుడిపై విచారణ

నందవరం: విద్యార్థులను కులం పేరుతో దూషించిన నందవరం మండలం పూలచింత ఎంపీయూపీ స్కూల్ ఉపాధ్యాయుడిపై ఆదోని డిప్యూటీ డీఈఓ వెంకట రమణ రెడ్డి విచారణ చేపట్టారు. ఇటీవల ఆ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు నరేష్, పవన్‌కుమార్ విద్యార్థులను కులం పేరుతో దూషించారని సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు నోటీసులు జారీ చేశారు. అయితే, నరేష్ అనే ఉపాధ్యాయుడిని వెంటనే విధుల్లోకి తీసుకోవడంతో ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. సదరు ఉపాధ్యాయుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈనేపథ్యంలో మంగళవారం ఆదోని డిప్యూటీ డీఈఓ ఆ పాఠశాలకు చేరుకుని విచారణ చేపట్టారు. నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఆయన వెల్లడించారు. కాగా తొలగించిన ఇద్దరి ఉపాధ్యాయులను విధుల్లోకి తీసుకోవాలని గ్రామస్తులు డిప్యూటీ డీఈఓ వెంకటరమణారెడ్డికి వినతి పత్రం అందజేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి


మృతిచెందిన వ్యక్తి

కోడుమూరు రూరల్: కర్నూలు–బళ్లారి రోడ్డుపై కె. నాగులపురం వద్ద ఉన్న ఎస్ఆర్ పెట్రోల్ బంకు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. సోమవారం రాత్రి ఈ సంఘటన జరిగింది. స్థానికుల సమాచారంతో కె.నాగలాపురం పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడు గులాబీరంగు టీషర్ట్, నలుపు, తెలుపు నిలువు గీతల పాయింట్ ధరించి ఉన్నాడని, అలాగే కుడిచేతిపై హరిత పేరుతో పచ్చబొట్టు ఉందని ఎస్ఐ ఆశలత తెలిపారు. మృతదేహాన్ని కర్నూలు పెద్దాసుపత్రికి తరలించామని, సంబంధికులు ఎవరైనా ఉంటే తమ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.


కర్నూలు మార్కెట్ ధరలు (క్వింటా రూ..ల్లో

పంట	తక్కువ ధర	ఎక్కువ ధర
వేరుశనగ	రూ. 1,059	రూ. 6,634
పొద్దుతిరుగుడు	రూ. 5,300	రూ. 5,509
ఆముదం	రూ. 4,889	రూ. 5,984
వాము	రూ. 802	రూ. 17,222
ఉల్లి	రూ. 509	రూ. 4,081
ఎండుమిర్చి	రూ. 2,699	రూ. 10,048
శనగలు	రూ. 4,560	రూ. 5,010
కందులు	రూ. 6,891	రూ. 8,909
మొక్కజొన్న	రూ. 1,717	రూ. 2,279
మినుములు	రూ. 4,841	రూ. 7,049
కొర్రలు	రూ. 2,309	రూ. 3,769
సోయాచిక్కుడు	రూ. 2,869	రూ. 2,869
సజ్జలు	రూ. 1,971	రూ. 2,081

అధ్యాపకుల ఉద్యమ బాట

- కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేసేందుకు ప్రత్యేక చట్టం చేసిన గత సర్కారు
- అధికారంలోకి వచ్చాక పట్టించుకోని కూటమి సర్కారు
- ఆందోళన కార్యక్రమాలు చేపట్టిన అధ్యాపకులు

కర్నూలు సిటీ: ఎన్నికల్లో ఓటేసి గెలిపిస్తే అధికారంలోకి వచ్చిన వెంటనే మిమ్మల్ని రెగ్యులర్ చేస్తామని కాంట్రాక్టు అధ్యాపకులకు కూటమి నాయకులు హామీచ్చారు. అయితే, అధికారంలోకొచ్చి నాలుగు నెలలవుతున్నా హామీని పట్టించుకోలేదు. దిక్కుతోచని పరిస్థితిలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు ఎన్డీఏ కూటమి తీరుకు నిరసనగా ఆందోళన బాట పట్టారు. ఇందులో భాగంగా మంగళవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రూపాల్లో నిరసనలు తెలుపుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 42 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 327 మంది కాంట్రాక్టు అధ్యాపకులు పని చేస్తున్నారు. 2000 సంవత్సరంలో జూనియర్ కాలేజీల్లో కాంట్రాక్టు అధ్యాపకుల నియామకాలు చేపట్టారు. అప్పటి నుంచి నేటి వరకు అత్తెసరు వేతనాలతోనే వారు పని చేస్తున్నారు. ప్రభుత్వ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థుల ఉత్తీర్ణతలో కీలక పాత్ర కాంట్రాక్టుల లెక్చరర్లదే. అయితే, ఏళ్ల గడుస్తున్నా వారికి రెగ్యులర్ చేయడంలో పాలక పక్షాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వస్తున్నాయి. 2019 ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేసేందుకు గతేడాది అక్టోబరు 21వ తేదీన జీఓ నెంబరు 114ను జారీ చేసి, ప్రత్యేక చట్టం చేశారు. అయితే, అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమి రెగ్యులర్ విషయాన్ని పట్టించుకోవడం లేదు. దీంతో హామీ అమలు కోసం లెక్చరర్లు ఉద్యమ బాట పట్టాల్సి వచ్చింది.


కేవీఆర్ బాలికల జూనియర్ కాలేజీలో పచ్చ బ్యాడ్జీల ధరించి నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు

ఉద్యమ కార్యాచరణ ఇలా!

నిరసనలో భాగంగా ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు మంగళవారం నుంచి పసుపు బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతున్నారు. సర్కారు స్పందించకపోతే 20 నుంచి సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం, పిఠాపురం, మంగళగిరి నియోజకవర్గాల్లో ప్రత్యేక హోమాలు, యజ్ఞాలు చేస్తూ ఆవేదన వ్యక్తం చేయాలని నిర్ణయించారు. అప్పటికీ స్పందించకుంటే 24వ తేది నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మౌన దీక్షలు చేసేందుకు కాంట్రాక్ట్ లెక్చరర్లు సిద్ధమవుతున్నారు.

నాలుగు దశల్లో శనగ విత్తనాల నాణ్యత ధ్రువీకరణ

కర్నూలు(అగ్రికల్చర్): సబ్సిడీపై పంపిణీ చేసే శనగ విత్తనాల నాణ్యత ప్రమాణాలను నాలుగు దశల్లో పరీక్షిస్తున్నట్లుగా ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ(ఏపీ సీడ్స్) మేనేజర్ ధనలక్ష్మి తెలిపారు. వ్యవసాయ అధికారులు, ఏపీ సీడ్స్ సిబ్బంది పర్యవేక్షణలో పకడ్బందీగా ప్రాసెసింగ్ చేసిన విత్తనాలను ప్యాకింగ్ చేసి రైతు సేవా కేంద్రాలకు తరలిస్తున్నామని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు పంపిణీ చేసే ముందు ఆయా గ్రామాల్లోని అభ్యుదయ రైతుల సమక్షంలో వ్యవసాయ అధికారులు నాణ్యతను ధ్రువీకరించిన తర్వాతనే పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడటం లేదని తెలిపారు. టెండరుదారులు ఉమ్మడి జిల్లాకు కేటాయించిన మేరకు శనగ విత్తనాలను సరఫరా చేస్తున్నారని పేర్కొన్నారు.రాష్ట్ర స్థాయి ధరల నిర్ణయ కమిటీ స్థానిక మార్కెట్ ధరలను అనుసరించి (విత్తన శుద్ధి, ప్యాకింగ్, రవాణ ఖర్చులు, ప్రాసెసింగ్ తదితర వాటిని) అమ్మకపు ధరలు నిర్ణయిస్తుందని తెలిపారు.